బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించే వారి సమాచారం ఇవ్వాలి : ఎస్పీ శబరీష్

ములుగురూరల్, మార్చి20 : సోషల్ మీడియా వేదికగా ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లను ప్రోత్సహించే వారి సమాచారాన్ని పోలీస్ అధికారులకు అందించాలని ఎస్పీ శబరీశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమ బెట్టింగ్ యాప్‌ల్లో బెట్టింగ్‌లకు పాల్పడినా, ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌ల్లో గేమ్స్ ఆడే వారిపై చట్ట రీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. బెట్టింగ్ యాప్‌ల సమాచారాన్ని డయల్ 100కు గానీ, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో గానీ అందించాలన్నారు. అలాగే టెన్త్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. నేటి నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే పరీక్షల సందర్భంగా పోలీస్ శాఖ ద్వారా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రంలోనికి వెళ్లే ముందు తనిఖీలు నిర్వహించే పోలీసులకు సహకరించాలని ఎస్పీ సూచించారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం : ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి రూరల్, మార్చి 20 : యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎస్పీ కిరణ్ ఖరే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని ప్రారంభ దశలోనే గుర్తించి నివారించాలన్నారు. చెడు అలవాట్లకు బానిసై యువత చెడిపోవద్దని, కుటుంబ సభ్యులు, బంధువులకు దూరం కావొద్దని సూచించారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయి సంబధిత సమాచారం తెలిస్తే 87126 58111 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ పేర్కొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన కల్పించాలి

ములుగురూరల్, మార్చి 20 : సికిల్ సెల్ ఎనీమియాపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. గురువారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శిబిరం నిర్వహించగా ములుగు, భూపాలపల్లి జిల్లా వైద్యాధికారులు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు హాజరయ్యారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ 2047 నాటికి సికిల్ సెల్ రక్తహీనతను అంతమొందించాలని పిలుపునిచ్చారు. అనువంశికంగా సక్రమింపజేసే వ్యక్తుల వివాహాల వల్ల కలిగే సంతానం సికిల్ వాధికి గురికాకుండా కుటుంబ నియంత్రణ పద్ధతులను సంబంధిత కుటుంబాలు అవలంబించేలా చేయాలన్నారు. వ్యాధి నివారణకు నీటిని తీసుకోవడంతో పాటు పోషకాహారాన్ని, పోలిక్ యాసిడ్ సప్లిమెంటరీ ట్యాబ్లెట్లను వాడాలని సూచించారు. అనంతరం డాక్టర్ శ్రావణ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వ్యాధి లక్ష్యణాలను వివరించారు. కార్యక్రమంలో రెండు జిల్లాల ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వైద్యులు, సిబ్బంది చంద్రకాంత్, పవన్‌కుమార్, శ్రీకాంత్, రణధీర్, సురేందర్, ప్రమోద్, డెమో సంపత్, దుర్గారావు, పూర్ణ సంపత్‌రావు, ప్రవీణ్, నిఖిల్, కిరణ్ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : డీఎస్పీ

ములుగురూరల్, మార్చి 20 : 10వ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు డీఎస్పీ రవీందర్ అన్నారు. గురువారం ఆయన ములుగు, మల్లంపల్లి మండలాల్లోని పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష కేంద్రం సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థినుల తనిఖీలో భాగంగా ఉమెన్ కర్టెన్ ఏర్పాటు చేసి మహిళా సిబ్బందితో తనిఖీ చేయించాలన్నారు. ఎగ్జామినేషన్ సెంటర్ ఇన్‌చార్జి తప్ప సెంటర్‌లోపలికి ఎవరు మొబైల్ ఫోన్ తీసుకుపోవద్దన్నారు. ప్రవేశం వద్ద బాక్స్‌ను ఏర్పాటు చేసి అందులో ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను వేయాలని తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు జిరాక్స్ షాపులు వేసి వేయాలని, 144 సీఆర్‌పీసీ, 163 బీఎన్‌ఎస్‌ఎస్ అమల్లో ఉంటుందన్నారు. నలుగురి కంటే ఎక్కువ మంది ఉన్నా, జిరాక్స్ షాపులను పరీక్ష సమయాల్లో తీసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉగాది పురస్కారం అవార్డు అందుకున్న ఆద్విక

భూపాలపల్లి రూరల్, మార్చి 20 : జిల్లా కేంద్రానికి చెందిన చల్లూరి ఆద్విక కళా రంగంలో అందజేయనున్న ఉగాది పురస్కార అవార్డుకు ఎంపికైనది. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ ఆడిటోరియంలో కేఎస్‌డీ చారిటబుల్, విశ్వ విఖ్యాత ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎస్‌వీఆర్ వెంకటేష్, డాక్టర్ కోటేశ్వరమ్మ, దైవాజ్ఞశర్మ చేతుల మీదుగా అవార్డును అందుకున్నది. ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు తీసుకుంటున్న చల్లూరి ఆద్విక

సరస్వతి పుష్కరాల పనులు త్వరగా పూర్తి చేయాలి

- దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్
- కాళేశ్వరంలో పనులపై అధికారులతో సమీక్ష

మహదేవపూర్(కాళేశ్వరం), మార్చి 20 : కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు జరుగనున్న సరస్వతి పుష్కరాల పనులను త్వరగా పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. గురువారం దేవాదయశాఖ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి ఆయా శాఖల అధికారులతో ఈవో కార్యాలయంలో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. భక్తుల సౌకర్యాలను మెరుగుపర్చేందుకు చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల ప్రగతిని పరిశీలించారు. సరస్వతి విగ్రహం ఏర్పాటుకు స్థలం నిర్ణయించడం, వీఐపీ ఘాట్ నుంచి గోదావరి ఘాట్ వరకు రహదారి నిర్మాణం, పురుషులు, మహిళల కోసం శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. గోదావరి హారతికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, వీఐపీ ఘాట్ నుంచి గోదావరి ఘాట్ వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. పూర్తిచేయాల్సిన శాశ్వత, తాత్కాలిక పనులకు ముందుగానే షెడ్యూల్ తయారు చేసుకోవాలని, సిబ్బందిని పెద్ద

అధికారులకు సూచనలు ఇస్తున్న శైలజా రామయ్యర్

సంఖ్యలో ఏర్పాటు చేసి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. అంచనాల్లో వ్యత్యాసాలు, చేపట్టే పనులపై నివేదికలు రెండు రోజుల్లో అందజేయాలన్నారు. పుష్కర సమాచారం తెలిసేలా ప్రత్యేకంగా యాప్ తయారు చేయాలని, విస్తృత ప్రచారానికి అంబాసిడర్ నియమించాలన్నారు. పుష్కర 12 రోజుల కార్యక్రమాలకు సంబంధించి షెడ్యూల్ తయారు చేయాలని ఈవోను ఆదేశించారు. గోదావరిలో నీటి నిల్వలను పరిశీలించాలని తెలిపారు. సత్రం పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. ప్రముఖ ప్రాంతాల్లో ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గోదావరిలోకి భక్తులు వెళ్లకుండా ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అంతకు ముందు వీఐపీ ఘాట్, గోదావరి ఘాటు వద్ద చేపట్టనున్న పనులు, సత్రం పనులను పరిశీలించారు. అనంతరం ఈవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ రాహుల్ శర్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇంజినీరింగ్ శాఖల ద్వారా చేపట్టనున్న పనుల ప్రగతిని వివరించారు. సమావేశంలో దేవస్థానం ఆర్జేసీ రామకృష్ణారావు, ఈవో మహేశ్, ఈఈ తిరుపతిరావు, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, దేవస్థాన అధికారులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్యలు లేకుండా చర్యలు

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాటారం, మార్చి 20 : వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. గురువారం కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాటారం, భూపాలపల్లి డివిజన్లలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యటనలు నిర్వహించి అవసరమైన చోట బోర్లు వేయించాలన్నారు. కాటారం సబ్ డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. మినీ స్టేడియం, చిల్డ్రెన్ పార్క్ నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టాలన్నారు. బస్టాండ్లు, రోడ్లు, పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలన్నారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడంతో పాటు, చెరువుల నిర్మాణానికి భూసేకరణ తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. రైతులకు ప్రాజెక్టు ప్రయోజనాలు త్వరగా అందించాలని తెలిపారు. ఇసుక

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

లారీల వేగాన్ని నియంత్రించేందుకు సీసీ కెమెరాలు, స్పీడ్ గన్స్, చెక్ పోస్టులు, పార్కింగ్ ఏరియాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా లారీలు రోడ్డుపై ఓవర్ టేకింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని, అనుమతుల ప్రకారం ఆ రోజు మాత్రమే లారీల రవాణా జరగాలనే నియమాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు.సమావేశంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ ఛైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, ఎస్పీ కిరణ్ ఖరే, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఆర్డీవో నరేశ్, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు ఆయన మండల కేంద్రంలోని బీఎల్ఎం గార్డెన్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఫర్టిలైజర్ షాపులో టాస్క్‌ఫోర్ దాడులు !

గోవిందరావుపేట, మార్చి 20 : చల్వాయి గ్రామంలోని ఓ ఫర్టిలైజర్ షాపులో గడువు ముగిసిన పురుగు మందులను రైతులకు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం సాయంత్రం ఫర్టిలైజర్ షాపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించినట్లు సమాచారం. వరంగల్ కేంద్రంగా ఈదందా సాగుతున్నదనే సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి వరంగల్‌లో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న వ్యక్తి సమాచారం మేరకు చల్వాయి గ్రామంలోని ఫర్టిలైజర్ షాపు యజమాని రైతులకు విక్రయాలు చేస్తున్నాడనే సమాచారం తెలుసుకొని ఒక్క సారిగా షాపుపై దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో సుమారు రూ.లక్ష పైబడిన మందులను స్వాధీనం చేసుకొని యజమానిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కాగా, దాడుల్లో వరంగల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఉన్నట్లు తెలిసింది.

మసీదులో సీసీ కెమెరాలు ఏర్పాటు

వెంకటాపూర్, మార్చి 20 : మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలోని మదీనా మసీదులో సీసీ కెమెరాలను వెంకటాపూర్ ట్రైనీ ఎస్సైలు చంద్రశేఖర్, నరేశ్, మజీద్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కలాం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మహ్మద్ సర్వర్‌తో కలిసి ప్రారంభించారు. ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు మసీదులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఫౌండేషన్ సభ్యులు పెండ్యాల సలేంద్రం, మైనార్టీ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో పెసా గ్రామ సభలు

వాజేడు, మార్చి 20 : ఎస్‌టీఎస్‌డీఎఫ్ పథకం కింద 2024-25 సంవత్సరానికి మంజూరైన బోర్‌వెల్స్‌కు లబ్ధిదారులను ఎంపిక చేయడంలో భాగంగా మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఈనెల 24,25 తేదీల్లో పెసా గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీవో శ్రీకాంత్ నాయుడు గురువారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. 24న ధర్మవరం, అయ్యవారిపేట, చంద్రుపట్ల, చీకుపల్లి, చెరుకురు, చింతూరు, దూలపురం, ఎడ్జర్లపల్లి, 25న గుమ్మడిదొడ్డి, కొంగాల, కృష్ణాపురం, మొరుమురు, పేరూరు, పూసూరు, టేకులగూడెం కాలనీ, నాగారం, పెద్దగొల్లగూడెం జీపీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

క్రైస్తవ హక్కుల రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా రాజేశ్

కృష్ణకాలనీ, మార్చి 20 : క్రైస్తవ హక్కుల రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా భూపాలపల్లికి చెందిన కప్పల రాజేశ్‌ను నియమిస్తూ ఆ సంఘం నేషనల్ అధ్యక్షుడు ఇర్మియ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో రాజేశ్‌కు నియామక పత్రం అందజేశారు.

రాజేశ్‌కు నియామక పత్రం ఇస్తున్న ఇర్మియ

ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

ములుగురూరల్, మార్చి 20 : రాజకీయ పార్టీల నాయకులు ఓటరు జాబితా రూపకల్పన, నవీకరణకు సహకరించాలని డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ అన్నారు. గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజకీయ పార్టీల నాయకులు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకొని జాబితాలను అందజేయాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో వెంకటేశ్, తహసీల్దార్ విజయ్‌భాస్కర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సలీమ్ పాల్గొన్నారు.

ఎస్సైకి రివార్డు అందించిన ఏఎస్పీ

ఏటూరునాగారం, మార్చి 20 : ఏటూరునాగారం ఎస్సై తాజొద్దీన్‌కు ఏఎస్పీ శివం ఉపాధ్యాయ గువారంనగదు రివార్డును అందించారు. కేసుల విచారణ విభాగంలో ఉత్తమ సేవలో అందించే అధికారులను గుర్తించి నగదు రివార్డులను అందిస్తారు. ఇందులో భాగంగా ఇటీవల ఎస్సై గంజాయి లాంటి మత్తు పదార్థాలను తరలించే వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేసినందుకు గాను నగదు రివార్డులను అందించినట్లు ఏఎస్పీ పేర్కొన్నారు. ఎస్సైకి స్థానిక సీఐ శ్రీనివాస్‌తో పాటు పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పోచమ్మ గుడి గోడను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

కృష్ణకాలనీ, మార్చి 20: మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు కృష్ణకాలనీలో పోచమ్మ గుడి చుట్టూ నిర్మించిన ప్రహరీని కూల్చివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ ఎడ్ల మౌనికా శ్రీనివాస్ కోరారు. గురువారం ఆమె గోడను పరిశీలించి ప్రజలను వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గుడికి గేటు కావాలని ప్రజలు కోరగా తాము చేయిచామన్నారు. నాలుగు రోజుల క్రితం సాయంత్రం వరకు గేటు, గోడ బాగానే ఉందని, కానీ గురువారం తెల్లవారే సరికి గేటు, ప్రహరీ కూలిపోయి ఉందని స్థానికులు తమకు తెలిపారన్నారు. తాము గతంలో చేసిన అభివృద్ధి కాలనీలో కనపడొద్దనే అధికార కాంగ్రెస్ నాయకులే చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కక్ష సాధింపు చర్యలు ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ, కానీ ఆలయాలపై కాదన్నారు. ఘటనపై విచారణ చేపట్టి నిందితులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బెట్టింగ్ నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

మంగపేట, మార్చి 20 : మరో రెండు రోజుల్లో ఐపీఎల్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో యువత క్రికెట్‌పై ఉన్న మోజుతో భారీ ఎత్తున బెట్టింగ్ పాల్పడే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు బెట్టింగ్ నిర్మూలనకు చర్యలు చేపట్టాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకుడు అక్కినపెల్లి సురేశ్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ బెట్టింగ్‌ల్లో లక్షల రూపాయలు పోగొట్టుకొని అప్పుల ఊబిలో కూరుకుపోయి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత వాటికి దూరంగా ఉండాలని కోరారు.

తునికాకు బోనస్‌పై విచారణ

ఏటూరునాగారం, మార్చి 20 : ఏటూరునాగారంలోని అటవీశాఖ నార్త్ రేంజ్ పరిధిలో తునికాకు బోనస్ అక్రమాలపై విచారణ జరుగుతున్నది. వివరాలిలా ఉన్నాయి.. 2023లో నార్త్ రేంజ్ పరిధిలో తునికాకు సేకరణ చేపట్టారు. కాగా, ఆకు సేకరణ అనంతరం సేకరణదారులకు బోనస్ మంజూరు కాగా, వారి ఖాతాల్లో జమ చేశారు. అంతేకాకుండా అటవీశాఖ విభాగంలో ఔట్ సోర్సింగ్‌పై పనిచేస్తున్న ఏడుగురు ఉద్యోగుల ఖాతాలో రూ.2.80 లక్షలు జమైనట్లు అటవీశాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. విచారణ చేపట్టగా కంప్యూటర్ ఆపరేటర్ తండ్రితో పాటు టింబర్ డిపోలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు, ప్లాంటేషన్‌లో పనిచేస్తున్న మరో ఇద్దరు, బేస్ క్యాంపులో పని చేస్తున్న ఇద్దరి ఖాతాల్లో డబ్బులు జమైనట్లు తేలింది. దీంతో ఖంగుతిన్న ఉన్నతాధికారులు తమ కింది స్థాయి అధికారులకు ఈ విషయంపై విచారణ చేపట్టి సంబంధిత వ్యక్తులపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. దీంతో నార్త్ రేంజ్ అధికారి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. అయితే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మాత్రం తమ ఖాతాలో జమైన డబ్బులను ఇదే శాఖలో పనిచేస్తున్న ఒక అధికారికి డ్రా చేసి ఇచ్చినట్లు ఆరోపిస్తున్నారు. అసలు వారి ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ చేసింది ఎవరు ? డ్రా చేసిన తర్వాత డబ్బులు తీసుకున్నది ఎవరు ? అనే దానిపై విచారణ చేస్తున్నట్లు సమాచారం. అటవీశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు.

డిగ్రీ అడ్మిషన్ల కోసం విస్తృత ప్రచారం

మహదేవపూర్, మార్చి 20 : మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం కళాశాల అధ్యాపకులు గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ కళాశాల ప్రాముఖ్యత గురించి వివరించే కర పత్రాలను పంపిణీ చేశారు. కళాశాలలో సౌకర్యాలు, ఆయా గ్రూపుల వివరాలను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డీ శ్రీనివాస్, డాక్టర్ పోరిక రాజు, పరశురాములు, మున్నయ్య, డాక్టర్ రజిత, రాజేందర్, రవీందర్, రమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డు కార్మికుడికి గాయాలు

కృష్ణకాలనీ, మార్చి 20 : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో లారీ ఢీకొనడంతో రిటైర్డ్ సింగరేణి కార్మికుడికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఓసీ -2 నుంచి జెన్కోకు బొగ్గు తరలించే లారీ అంబేద్కర్ కూడలి మీదుగా వెళ్తుండగా అంబేద్కర్ కూడలి నుంచి సుబాష్ కాలనీకి చెందిన స్వామి ద్విచక్ర వాహనంతో రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టింది. దీంతో అతడు కిందపడిపోగా కాలికి గాయాలయ్యాయి. వెంటనే అతడిని స్థానికులు సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు..

రహదారిపై కూలిన భారీ వృక్షం

గణపురం, మార్చి 20 : మండలంలోని సీతారాంపురం ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి పెద్ద వృక్షం కూలిపడింది. దానిని ఎవరూ తొలగించకపోవడంతో బంగ్లాపల్లి, సీతారాంపురం, కొండాపురం, రంగారావుపల్లి, గుర్రంపేట గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. భారీ వృక్షాన్ని అధికారులు ఎవరూ తొలగించకపోవడంతో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల, విద్యార్థుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి వృక్షాన్ని తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

బెటర్మెంట్ క్వార్టర్స్ కౌన్సెలింగ్

కృష్ణకాలనీ, మార్చి 20 : మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో భూపాలపల్లి ఏరియాలో పని చేస్తున్న కార్మికులకు గురువారం బెటర్ మెంట్ క్వార్టర్ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఇన్‌చార్జి ఏరియా అధికార ప్రతినిధి, డీవైపీఎం గుండు రాజు తెలిపారు. ఆయా కాలనీల్లో టీఐ-2, ఎండీ (సుభాష్ కాలనీ, 1000 క్వార్టర్స్), రామప్ప కాలనీల్లోని 83 ఖాళీ క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించగా 352 మంది ఉద్యోగులను పిలిచినట్లు చెప్పారు. 60 మంది తమకు నచ్చిన క్వార్టర్లను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. ఇంకా 23 క్వార్టర్లు మిగిలిలాయని, కౌన్సెలింగ్ ప్రక్రియ కమిటీ సభ్యుల సమక్షంలో పూర్తి పారదర్శకంగా జరిగిందన్నారు. కమిటీ సభ్యుడిగా ఎస్ ఓటు జీఎం కవీంద్ర, కేటీకే-1 గ్రూప్ ఏజెంట్ వెంకటరమణ, ఏరియా ఇంజినీర్ రామకృష్ణారెడ్డి, డీజీఎం సివిల్ రవికుమార్, డీవైపీఎం క్రాంతికుమార్, సీనియర్ పీవో శ్రావణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ప్రణయ్ సాగర్ పాల్గొన్నారు.

కుప్ప కూలిన బొగ్గు టిప్పర్

భూపాలపల్లి రూరల్, మార్చి 20 : ఒక్కసారిగా బొగ్గు టిప్పర్ కుప్ప కూలిన ఘటన భూపాలపల్లి జిల్లా జాతీయ రహదారిపై గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కేటీకే-2 ఇంక్లైన్ నుంచి బొగ్గును తీసుకొస్తున్న సమయంలో టిప్పర్ క్యాబిన్ భూపాలపల్లి 100 పడకల ఆసుపత్రి ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై ఒక్కసారి కుప్పకూలి పోయింది. డ్రైవర్ లక్ష్మణ్ కుడి కాలు విరుగగా స్థానికులు 100 పడకల దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు

మొగుళ్లపల్లి, మార్చి 20 : మండలకేంద్రంలోని వెలుగు మండల సమాఖ్యలో మహిళలు పిల్లలు, వయోవృద్ధులు, వికలాంగులకు చట్టాలు, హక్కులపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, 181 టోల్ ఫ్రీ వ యోవృద్ధుల హెల్ప్ లైన్ నంబర్ 14567, వికలాంగుల హక్కులు, చ ట్టాలు, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930పై అవగహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రజిత, మాధవి, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఇన్‌చార్జి, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్లు అనూష, మమత పాల్గొన్నారు.

గణపురం సూపరింటెండెంట్‌గా నాగేశ్వర్‌రావు

గణపురం, మార్చి 20 : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా ఎం నాగేశ్వర్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కొన్నేండ్లుగా సూపర్‌వైజర్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ములుగు ఎస్సీ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న నాగేశ్వర్‌రావును సూపరింటెండెంట్‌గా గణపురానికి బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టి ఆయన ఎంపీడీవో భాస్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

భర్తతో గొడవపడి ఆత్మహత్య

సరిత (ఫైల్)

కన్నాయిగూడెం, మార్చి 20 : భార్య భర్తలు గొడవపడగా భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని తుపాకులగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉ పాధ్యాయుడిగా పనిచేస్తున్న సోలం కృష్ణ, సరిత దగ్గరలో ఉన్న క్వార్టర్స్‌లో ఉంటున్నారు. భార్య భర్తలు బుధవారం అర్ధరాత్రి గొడవడటంతో ఆవేశంలో సరిత (30) పురుగులమందు తాగింది. తోటి ఉపాధ్యాయుల సహకారంతో భర్త 108 వాహనంలో ఏటూరునాగారం సీఎచ్‌సీకి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కాగా, మృతురాలు సరిత తల్లి రామక్క ఫిర్యాదు మేరకు పాథమిక విచారణ చేపట్టి భార్యభర్తల గొడవ కారణంగానే సరిత ఆత్మహత్య చేసుకుందని ఎస్సై వెంకటేశ్ చెప్పారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధికి దరఖాస్తులు

భూపాలపల్లి రూరల్, మార్చి 20 : జిల్లాలోని అర్హులైన విద్యార్థుల నుంచి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు మే 19 వరకు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు